లను బయటపెట్టుకునే పరిస్థితి వచ్చింది. యువత కోరుకునే నవతెలంగాణ నిర్మాణం పక్కకుపోయింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్ ముట్టడికి అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రయత్నించడం రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించింది. ఒకవైపు ప్రజా సమస్యలపై చర్చిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోవైపు రాజకీయ కక్షలకు ప్రాధాన్యతనిచ్చారు. సభలో మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేటీఆర్ పోలీసు అధికారులను హెచ్చరించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. రాష్ట్రంలో రెండు కోట్ల మందికి పైగా ఓటర్లు ఉన్నప్పటికీ కేవలం ఒకే ఒక్క వ్యక్తి చుట్టూ రాజకీయం తిరగడం విడ్డూరం. ప్రజాధనం సుమారు 22 కోట్ల రూపాయలకు పైగా శాసనసభ నిర్వహణ కోసం ఖర్చవుతోంది. ఈ భారీ ఖర్చు ప్రజల సంక్షేమం కోసం జరగాల్సింది పోయి రాజకీయ రాద్ధాంతానికే పరిమితమైంది. అసెంబ్లీ వేదికగా ప్రతి పక్షాన్ని అణచివేయాలనే ప్రయత్నంలో ప్రభుత్వ ఉద్దేశాలు బట్టబయలయ్యాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభలో మాట్లాడిన భాష రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనంగా మారింది. ఏకంగా సావు కోరుతున్నామంటూ శాసనసభ్యులు వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే అవుతుంది. రాజకీయాల్లో సిద్ధాంతాలు విధానాలు చర్చకు రావాలి కానీ మృత్యువును కాంక్షించడం అన్యాయం. జగదీష్ రెడ్డి హరీష్‌రావు తదితరులు ప్రభుత్వాన్ని నిలదీసిన తీరు చూస్తే అధికార పార్టీ అభాసుపాలైంది. దళిత బంధు పథకం కింద 10 లక్షలు ఇస్తామని చెప్పి 12 లక్షలు చేస్తామన్న హామీ ఎందుకు అమలు కాలేదు. మూడు సంవత్సరాల కాలంలో ఒక్క దళితుడికి కూడా పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరలేదు. నిరుద్యోగ భృతి 2 లక్షల ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై యువత నిలదీస్తోంది. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం కేసీఆర్ అస్త్రం ప్రయోగిస్తోంది. ప్రజల అసంతృప్తి పెరుగుతున్న కొద్దీ ఇలాంటి పద్ధతులు తిరగబడే ప్రమాదం స్పష్టంగా ఉంది. ప్రభుత్వ పర్ఫార్మెన్స్‌ను లైమ్ లైట్‌లో ఉంచాల్సిన కాంగ్రెస్ పార్టీ తానే స్వయంగా కేసీఆర్ కు అనూహ్యమైన మైలేజ్ ఇస్తోంది. సభకు రాకపోయినా తెలంగాణ రాజకీయాలను ఆయనే శాసిస్తున్నాడనే భావన ప్రజల్లో బలపడుతోంది. ఇది ప్రత్యక్షంగా బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద లాభం చేకూరుస్తోంది. ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో ఎదురవుతున్న వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ వివాదాలు ఉపయోగపడుతున్నాయి. రాజకీయ వ్యూహకర్తలు చెబుతున్న లెక్కల ప్రకారం ఇది కాంగ్రెస్ కు ఆత్మహత్యాసదృశ్యమే. ప్రజలు కోరుకుంటున్నది కేసీఆర్ తిట్లు కాదు తమకు అందవలసిన సంక్షేమ పథకాలు ఉద్యోగాలు. మహిళలకు ఉచిత ప్రయాణం మినహా మిగిలిన హామీలు పూర్తిగా అమలుకు నోచుకోలేదు. ఈ నిజాన్ని మళ్లించడానికే ఎర్రవల్లి డ్రామాలు తెరపైకి తెచ్చారు. రాబోయే రోజుల్లో ఈ వ్యూహం వికటించి అధికార పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

## చింతల్‌లో ట్రాన్స్‌జెండర్ల హల్‌చల్

- **గృహప్రవేశంలో వసూళ్లకు బెదిరింపులు**
- **జీడిమెట్ల పోలీసులకు బాధితుల ఫిర్యాదు**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు**

సైబరాబాద్ - విశాల భారతి

ట్రాన్స్‌జెండర్ల ఆగడాలను ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని, బలవంతపు వసూళ్లకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాల్సిందేనని రాష్ట్ర డిజిపి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వులతో ధైర్యం తెచ్చుకున్న బాధితులు ఇప్పుడు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల చింతల్ ప్రాంతంలో జరిగిన ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు సృష్టించిన హల్‌చల్‌పై బాధితులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. నూతన గృహప్రవేశం సందర్భంగా అక్కడకు చేరుకున్న కొంతమంది ట్రాన్స్‌జెండర్ల బృందం ఇంటి యజమానిని అక్రమంగా భారీ మొత్తంలో నగదు డిమాండ్ చేసింది. అంత మొత్తం ఇవ్వడానికి యజమాని నిరాకరించడంతో, అక్కడే గొడవ చేస్తామని బెదిరింపులకు దిగారు. పండగ వాతావరణంలో ఉన్న వేడుకలో వచ్చిన అతిథులు, బంధువుల ముందే ఇంటి యజమానిని, వారి కుటుంబ సభ్యులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి అవమానించారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వివరాలు సోషల్ మీడియా గ్రూపుల్లోనూ వైరల్‌గా మారాయి. డజిపి ఆదేశాల నేపథ్యంలో బాధితుల నుండి ఫిర్యాదు స్వీకరించిన జీడిమెట్ల పోలీసులు తక్షణమే స్పందించారు. అక్రమంగా డబ్బులు డిమాండ్ చేయడం, బెదిరింపులకు పాల్పడి వేధింపులకు గురిచేయడం వంటి అంశాలపై సంబంధిత ట్రాన్స్‌జెండర్ల బృందంపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.




**ట్రాంజెండర్ల గోడపై రాతల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

## తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై వేటు




విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో మొదలైన వివాదం ఇప్పుడు శాసనమండలి వరకు వెళ్లింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై సస్పెన్షన్ పడింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి దూరంగా ఉంచాలని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఈ చర్యకు ముందు మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం పెట్టారు. తర్వాత మూజువాణి ఓటింగ్ జరిగింది. తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. వెంటనే ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్ అమల్లోకి వచ్చింది. ఈ పరిణామం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. సభలో మాటల హద్దు దాటితే ఎంతటి చర్యలు ఎదురవుతాయో ఈ ఘటన మరోసారి చూపించింది. సాధారణంగా రాజకీయ సభల్లో విమర్శలు సహజమే. కానీ స్పీకర్ పదవి గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు వస్తే సభా నియమాలు కఠినంగా మారుతాయని తాజా పరిణామం స్పష్టం చేసింది. దీంతో ఈ వ్యవహారం సాధారణ రాజకీయ విమర్శగా కాకుండా సభా క్రమశిక్షణ అంశంగా మారిపోయింది. ఈ అంశంపై రాజకీయ వేడి సమావేశాల రోజు వరకు కొనసాగే అవకాశం ఉంది. ఇదే సమయంలో అసెంబ్లీ కూడా ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుంది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గేలా వ్యాఖ్యలు చేయడాన్ని అసెంబ్లీ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా ప్రవర్తించడంపై అభ్యంతరం తెలిపింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలపైనా సభ స్పందించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని తీర్మానంలో పేర్కొన్నారు. స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. అసెంబ్లీ తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. అక్కడ మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటింగ్ తర్వాత సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అంటే ఒకే ఘటనపై రెండు సభల్లోనూ చర్యల ప్రక్రియ నడిచింది. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో సభా మర్యాదలపై కొత్త చర్చను తెరపైకి తెచ్చింది. ఎమ్మెల్సీల ప్రవర్తనపై అధికారపక్షం తీవ్రంగా స్పందించగా, ప్రతిపక్షం మాత్రం దీనిని రాజకీయ ఒత్తిడిగా చూస్తోంది. దీంతో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరే పరిస్థితి ఏర్పడింది. ఇక పోలీసు కేసు వ్యవహారం కూడా ఈ ఎపిసోడ్‌ను మరింత కీలకంగా మార్చింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు. పోలీసులు రిమాండ్ కోరినా నాంపల్లి కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశించింది. ఒక్కొక్కరు 10 వేల రూపాయల పూచీకత్తు సమర్పించడంతో పాటు రెండు ష్యూరిటీలు ఇవ్వాలని కోర్టు సూచించింది. ఆ నిబంధనలు పూర్తయ్యాక ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు. ఇక్కడ గమనించాల్సిన సంఖ్యలు రెండు. ఒక్కొక్కరికి 10 వేల రూపాయల బాండ్, ఇద్దరికి కలిపి 20 వేల రూపాయల పూచీకత్తు. ఒక్కొక్కరికి రెండు ష్యూరిటీలు చొప్పున మొత్తం నాలుగు ష్యూరిటీలు సమర్పించాల్సి వచ్చింది. పోలీసు విచారణ తర్వాత కూడా వెంటనే జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి రాలేదు. కోర్టు ఆదేశాల ప్రకారం బెయిల్ ప్రక్రియ పూర్తయింది. దీంతో రాజకీయ వివాదం న్యాయపరమైన దశను కూడా తాకింది. కోర్టు ఇచ్చిన ఈ ఆదేశం ప్రక్రియలో కీలక మలుపుగా నిలిచింది. కోర్టు నుంచి విడుదలైన వెంటనే ఇద్దరు ఎమ్మెల్సీలు తిరిగి శాసనమండలికి రావడం మరో కొత్త పరిణామంగా మారింది.

## వాచ్‌మెన్‌పై దాడి.. నలుగురిపై కేసు

- **అపార్ట్‌మెంట్ గేటు మూసివేతపై వాగ్వాదం**
- **ప్లాస్టిక్ కుర్చీలతో దాడి చేసినట్లు ఆరోపణ**

సైబరాబాద్ - విశాల భారతి

అపార్ట్‌మెంట్ గేటు మూసివేసిన విషయమై వాచ్‌మెన్‌లతో వాగ్వాదానికి దిగిన నలుగురు వ్యక్తులు ఓ వాచ్‌మెన్‌పై దాడికి పాల్పడిన ఘటన మాధాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 7న రాత్రి సుమారు 8.45 గంటలకు ట్రెండ్స్ ఆస్పైర్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌లుగా కాడ దుర్గ, వెంకటరమణ విధులు నిర్వహిస్తున్నారు. అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తులోని ఎంఎస్ జియోనిక్సా ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వ్యక్తులు గేటు మూసివేసిన విషయమై వాచ్‌మెన్‌లతో వాగ్వాదానికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో శివసాయి, కృష్ణ, స్వామి, జితేంద్ర అనే నలుగురు వ్యక్తులు వెంకటరమణను దుర్భాషలాడుతూ అక్కడున్న ప్లాస్టిక్ కుర్చీలతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వెంకటరమణపై దాడిని అడ్డుకునేందుకు కాడ దుర్గ ప్రయత్నించగా ఆమెను సైతం పక్కకు తోసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో వెంకటరమణ తలకు గాయమై రక్తస్రావం జరిగినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మాధాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## కాలనీల్లో తాగునీటి సమస్యలపై పాదయాత్ర

- **నిర్ణీత సమయంలో నీటి సరఫరా చేయాలి**
- **ఎత్తైన ప్రాంతాలకు ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి**

శేరిలింగంపల్లి - విశాల భారతి

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయిప్రశాంత్‌నగర్, శ్రీరామ్‌నగర్, కృష్ణవేణినగర్ కాలనీల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి హైదర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. కాలనీవాసులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి నీటి సరఫరా సమస్యలను పరిశీలించారు. రాత్రివేళల్లో నీటి సరఫరా జరుగుతోందని కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకురాగా, నిర్ణీత సమయంలోనే మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు సూచించారు.సాయిప్రశాంత్‌నగర్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో నీటి పైపులైన్ అవసరాన్ని గుర్తించి, వెంటనే కొత్త వాటర్‌లైన్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ విలియం ప్రకాష్, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



**సమస్యలపై పాదయాత్ర చేస్తున్న మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు**

## వీర తెలంగాణ పోరాట వారోత్సవాలు




- **10 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణ**
- **వనం సుధాకర్**

శేరిలింగంపల్లి - విశాల భారతి

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వనం సుధాకర్ తెలిపారు. ముజఫర్ అహ్మద్‌నగర్‌లో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సమావేశంలో కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేశారు. భూమి, భుక్తి, విముక్తి కోసం, వెట్టిచాకిరీ, జాగీర్దారీ, పటేల్-పట్వారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 11 నుంచి 16 వరకు గ్రామ, మండల, డివిజన్ కేంద్రాల్లో, 17న జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**30న శేరిలింగంపల్లి ఎంఆర్వో కార్యాలయం ఎదుట ధర్నా...**

శేరిలింగంపల్లి మండల పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణతోపాటు అధికారుల అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 30న ఎంఆర్వో కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ(యూ) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజలు ధర్నాలో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశానికి ఇస్లావత్ దశరథ్ నాయక్ అధ్యక్షత వహించగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో టీపీసీసీ అధ్యక్షుడిగా బీసీ బిడ్డ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల ప్రస్థానం ఒక సాధారణ పదవీకాలంగా చూడలేం. ఎందుకంటే ఆయన పార్టీకి క్లిష్టమైన రాజకీయ పరిస్థితులు ఎదురైన సమయంలో పగ్గాలు చేపట్టిన మహేష్ కుమార్ గౌడ్.. ఆ బాధ్యతను కేవలం అధ్యక్ష పదవిగా కాకుండా, కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణాన్ని పునరుద్ధరించే అవకాశంగా మలచుకున్నారు. నాయకులతో సమావేశాలు నిర్వహించడం ఒక వైపు ఉంటే.. మరోవైపు నేరుగా కార్యకర్తల వద్దకు వెళ్లడం, జిల్లాల్లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, ఏఐసీసీ పిలుపులను గ్రామస్థాయికి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ విధానాన్ని బలంగా వినిపించడం వంటి అనేక కార్యక్రమాలను సమాంతరంగా నడిపించారు.

# టీపీసీసీ బాధ్యత - రెండేళ్లలో మహేషన్న మార్క్

కాగా, ఈ రెండేళ్ల కాలంలో టీపీసీసీకి జాతీయ నాయకత్వం నుంచి వచ్చిన మార్గదర్శకత్వం, రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వం నుంచి లభించిన సహకారం కూడా కీలకంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు వంటి అంశాలను జాతీయ రాజకీయ చర్చలో ముందుకు తీసుకెళ్తున్న సమయంలో.. వాటిని తెలంగాణలో క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ చురుకైన పాత్ర పోషించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో పార్టీ జాతీయ స్థాయిలో ఇచ్చిన కార్యక్రమాలకు తెలంగాణలో విస్తృత స్పందన తీసుకురావడంలోనూ రాష్ట్ర కాంగ్రెస్ యంత్రాంగాన్ని సమన్వయం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ టీపీసీసీ వ్యవస్థ చురుకుగా పనిచేసింది. ప్రభుత్వం తన బాధ్యతగా పాలన అందిస్తే.. ఆ పాలన ఫలితాలను ప్రజలకు వివరించడం, ప్రజల స్పందనను తిరిగి ప్రభుత్వానికి చేరవేయడం పార్టీ బాధ్యతగా మహేష్‌కుమార్ గౌడ్ వ్యవహరించారు. ఈ ప్రభుత్వంపార్టీ మధ్య సమన్వయానికి ఆయన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పాలనకు, పార్టీ కార్యకలాపాలకు మధ్య ఒక బలమైన వారధిని నిర్మించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా బీసీ కులగణన విషయంలో తెలంగాణ కాంగ్రెస్ ముందడుగు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ చర్చకు ప్రాధాన్యం తెచ్చింది. రాహుల్‌గాంధీ నిరంతరం ప్రస్తావిస్తున్న సామాజిక న్యాయం, జనాభా ప్రాతిపదికన హక్కులు, రాజకీయఆర్థిక ప్రాతినిధ్యం వంటి అంశాలను తెలంగాణలో పార్టీ శక్తివంతమైన రాజకీయ అంశాలుగా మలచుకుంది. బీసీ కులగణనను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా... సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ చేస్తున్న దీర్ఘకాలిక పోరాటంలో భాగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో టీపీసీసీ కీలకంగా పనిచేసింది. మహేష్‌కుమార్ గౌడ్ ఈ అంశానికి పార్టీ పరంగా బలమైన మద్దతు ఇవ్వడంతో బీసీ వర్గాల్లో కాంగ్రెస్ రాజకీయ సందేశం మరింత స్పష్టంగా వెళ్లింది. సామాజిక న్యాయం మాటల్లోనే కాకుండా పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ కనిపించాలన్న ఆలోచనకు ప్రాధాన్యం ఇచ్చారు. డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీల ఏర్పాటు, మండలాలు, పట్టణాలు, డివిజన్ల స్థాయిలో పార్టీ బాధ్యతల కేటాయింపులో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చే ప్రయత్నం జరిగింది. ప్రతి సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీలో స్థానం ఉందనే నమ్మకాన్ని కేడర్‌లో కల్పించడం ఈ ప్రక్రియలో ముఖ్యమైన అంశంగా మారింది. సంఘటన్ సృజన్ అభియాన్ ఈ సంస్థాగత కృషికి మరింత ఊపునిచ్చింది. పార్టీకి రాష్ట్రస్థాయిలో అధ్యక్షుడు ఉండటం మాత్రమే సంస్థాగత బలం కాదని... గ్రామం, మండలం, పట్టణం, జిల్లా స్థాయిలో పనిచేసే బలమైన వ్యవస్థ ఉండాలనే దృక్పథంతో నియామకాల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. డీసీసీ అధ్యక్షుల నియామకంతో ఆగకుండా జిల్లా కమిటీలను ఏర్పాటు చేయడం, మండలాలు, పట్టణాలు, డివిజన్ల స్థాయిలో అధ్యక్షులు, కమిటీలను నియమించడం ద్వారా పార్టీ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించే ప్రయత్నం చేశారు. ఇది ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే పనిచేసే యంత్రాంగం కాకుండా... నిరంతరం ప్రజల్లో ఉండే పార్టీ నిర్మాణానికి పునాది వేయాలన్న ఉద్దేశాన్ని ప్రతిబింబించింది. జిల్లాల్లో జరిగే పార్టీ కార్యవర్గ సమావేశాలకు టీపీసీసీ అధ్యక్షుడు స్వయంగా హాజరు కావడం కూడా ఈ ప్రక్రియలో ఒక ప్రత్యేకమైన అంశంగా నిలిచింది. సాధారణంగా రాష్ట్రస్థాయి నాయకత్వం జిల్లా నాయకత్వంతో సమావేశాలు నిర్వహించడం సహజమే అయినా... మహేష్‌కుమార్ గౌడ్ నియామక పత్రాలను స్వయంగా అందిస్తూ, స్థానిక నాయకులతో నేరుగా మాట్లాడటం ద్వారా రాష్ట్ర నాయకత్వం కేడర్‌కు దగ్గరగా ఉందనే భావనను కల్పించారు. పార్టీ పదవి ఇచ్చిన నాయకుడిని కేవలం నియమితుడిగా కాకుండా... పార్టీ నిర్మాణంలో భాగస్వామిగా గుర్తించడం ద్వారా బాధ్యతా భావాన్ని పెంచారు. ఇక వికారాబాద్‌లో నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం కూడా ఈ సంస్థాగత ఆలోచనకు ప్రతీకగా నిలిచింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా పార్టీ సంస్థాగత వ్యవస్థకు శిక్షణ, రాజకీయ అవగాహన, ప్రజా సమస్యలపై స్పందన, పార్టీ కార్యక్రమాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వంటి జాతీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణానికి జాతీయ నాయకత్వం ఇస్తున్న ప్రాధాన్యం స్పష్టమైంది. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ నుంచి మహేష్‌కుమార్ గౌడ్ పనితీరుపై ప్రశంసలు రావడం రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని కలిగించింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాజకీయ ఆలోచనలను తెలంగాణలోని ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా స్వాతంత్ర్య పోరాట విలువలు, అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ పరిరక్షణ అనే మూడు అంశాలను కాంగ్రెస్ రాజకీయ సందేశంలో భాగం చేశారు. దేశంలోనే ఈ కార్యక్రమాన్ని తెలంగాణలో విస్తృతంగా నిర్వహించడంపై పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి పెట్టాయి. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలను కేవలం సభలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం ద్వారా కాంగ్రెస్ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి చేర్చే ప్రయత్నం జరిగింది. మహేష్‌కుమార్ గౌడ్ రాజకీయ శైలి మరో ప్రత్యేకత... జనహిత పాదయాత్రలు. రాజకీయ నాయకుడిగా వేదికపై ప్రసంగించడం కన్నా.. ప్రజల మధ్య నడవడం, వారి సమస్యలు వినడం, కార్యకర్తలతో మాట్లాడడం ద్వారా రాజకీయ సంబంధాలను బలోపేతం చేయాలనే విధానాన్ని ఆయన ఎంచుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ పార్టీ కార్యకర్తల ఇళ్లకు, గ్రామాలకు వెళ్లడం ద్వారా టీపీసీసీ అధ్యక్ష పదవిని గాంధీ భవన్ గోడల మధ్య పరిమితం చేయలేదు. క్షేత్రస్థాయి కార్యకర్తకు రాష్ట్ర అధ్యక్షుడు తన వద్దకు వచ్చాడనే భావన కల్పించడం ద్వారా పార్టీపై అతని అనుబంధాన్ని పెంచే ప్రయత్నం చేశారు. గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాలు కూడా ప్రభుత్వంపార్టీ సమన్వయానికి ఉపయోగపడే వేదికగా మారాయి. ప్రభుత్వంలో మంత్రులు విధానాలు అమలు చేస్తుంటే... వాటిపై ప్రజల స్పందనను పార్టీ కార్యకర్తలు ముందుగా తెలుసుకుంటారు. ఈ రెండు వ్యవస్థల మధ్య సమాచారం సజావుగా ప్రవహించాలంటే ఇలాంటి ప్రత్యక్ష సమావేశాలు అవసరం. ఈ ఆలోచనతో మంత్రులను పార్టీ కార్యాలయానికి ఆహ్వానించి కార్యకర్తలు, ప్రజల సమస్యలను వారి ముందుంచే కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పార్టీకి, ప్రభుత్వానికి మధ్య అనుసంధానాన్ని మరింత బలపరిచారు. ఏఐసీసీ పిలుపుల అమలులోనూ తెలంగాణ కాంగ్రెస్ వెనుకబడకుండా చూసే ప్రయత్నం జరిగింది. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విషయంలో పేరు, విధానాల్లో మార్పులు చేస్తోందనే ఆరోపణలపై గ్రామగ్రామాన నిరసన కార్యక్రమాలు నిర్వహించడం, రామ్‌జీ విధానానికి వ్యతిరేకంగా గ్రామ తీర్మానాలు చేయించడం వంటి కార్యక్రమాల ద్వారా కేంద్ర విధానాలపై కాంగ్రెస్ అభ్యంతరాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. పార్టీ కేంద్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు కేవలం రాష్ట్ర కార్యాలయంలో కార్యక్రమంగా మిగలకుండా.. మండలాలు, గ్రామాల వరకు చేరేలా పార్టీ యంత్రాంగాన్ని కదిలించడం మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో కనిపించిన సంస్థాగత చురుకుదనం. ఇక 'ఓట్ చోరీ' అంశంపైనా కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహించింది. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అనే సందేశంతో గ్రామగ్రామాన సంతకాల సేకరణ చేపట్టడం ద్వారా ఈ అంశాన్ని క్షేత్రస్థాయి రాజకీయ చర్చగా మార్చే ప్రయత్నం జరిగింది. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అవగాహన పెంచడం, ఓటు హక్కు పరిరక్షణపై కార్యకర్తలను అప్రమత్తం చేయడం వంటి కార్యక్రమాలు పార్టీ యంత్రాంగాన్ని నిరంతరం ప్రజల్లో ఉంచాయి. 'న్యాయ్ భోజ్', 'చాత్రోంకీ గూంజ్' వంటి ఏఐసీసీ కార్యక్రమాలకు కూడా తెలంగాణలో మంచి స్పందన తీసుకురావడానికి టీపీసీసీ ప్రయత్నించింది. విద్యార్థులు, యువత, పేదలు, కార్మికులు, రైతులు, మహిళలు వంటి వివిధ వర్గాలతో పార్టీకి సంబంధాన్ని పెంచే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. కాంగ్రెస్ అంటే కేవలం ఎన్నికల సమయంలో కనిపించే పార్టీ కాదు.. ప్రజా సమస్యలపై నిరంతరం మాట్లాడే, ప్రజలతో కలిసి నడిచే పార్టీ అనే భావనను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా కనిపించింది. ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో టీపీసీసీ ప్రత్యేక శ్రద్ధ చూపింది. ఓటర్ల జాబితా, ఓటు హక్కు, అర్హులైన ఓటర్ల పేర్ల పరిరక్షణ వంటి అంశాల్లో కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేసేలా పార్టీ వ్యవస్థను సమన్వయం చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా.. ఎన్నికలకు ముందే పార్టీ యంత్రాంగం గ్రామస్థాయిలో చురుకుగా ఉండేలా చేయడం ద్వారా కాంగ్రెస్ సంస్థాగత సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం జరిగింది. ఈ సంస్థాగత బలం ఎన్నికల సమయంలో కూడా కనిపించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, స్థానిక నాయకత్వాన్ని కలుపుకొని ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లడం, ప్రతి స్థాయి నాయకుడికి బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలు పార్టీ పనితీరులో ప్రతిబింబించాయి. ఒక ఉప ఎన్నికలో విజయం సాధించడం మాత్రమే కాకుండా.. ఆ విజయాన్ని పార్టీ కార్యకర్తల్లో నమ్మకాన్ని పెంచే రాజకీయ శక్తిగా మార్చడం కూడా ముఖ్యమైన విషయం. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రదర్శన కూడా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచింది. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ బలం పెంచుకోవడం, స్థానిక నాయకత్వాన్ని ముందుకు తీసుకురావడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాల్లో పార్టీ వ్యవస్థ పనిచేసింది. అదే సమయంలో సర్పంచ్ ఎన్నికల్లో వచ్చిన విజయాలు గ్రామస్థాయిలో కాంగ్రెస్‌కు ఉన్న పునాదులను మరింత బలపరిచాయి. స్థానిక ఎన్నికల్లో ఒక్కో విజయం పార్టీకి ఒక రాజకీయ సందేశంగా మారింది—కాంగ్రెస్ కేవలం రాష్ట్ర రాజధాని రాజకీయాల్లోనే కాకుండా గ్రామీణ తెలంగాణలోనూ తన పట్టు పెంచుకుంటోందనే సంకేతాన్ని ఇచ్చింది. ఈ విజయాల వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వం, మంత్రుల కృషి, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, చివరికి వేలాది మంది కార్యకర్తల శ్రమ ఉంది. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ చేసిన పని ఈ మొత్తం వ్యవస్థను ఒక దిశలో నడిపించడం. వ్యక్తిగత నాయకత్వాన్ని ప్రదర్శించడం కంటే.. సమష్టి నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వడం ఆయన పనితీరులో మరో ముఖ్యమైన అంశంగా కనిపించింది. రాహుల్‌గాంధీ ఆలోచనలు, మల్లికార్జున ఖర్గే మార్గదర్శకత్వం, రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలన, ఈ మూడు స్థాయిల మధ్య తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ కథనం నిర్మాణం జరిగింది. జాతీయ నాయకత్వం ఇచ్చిన రాజకీయ దిశను రాష్ట్రస్థాయిలో ప్రజా ఉద్యమాలుగా మార్చడం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకురావడం వంటి బాధ్యతలను టీపీసీసీ నిర్వహించింది. ఈ సమన్వయంలో మహేష్‌కుమార్ గౌడ్ పాత్రను ప్రత్యేకంగా గుర్తించాల్సి ఉంటుంది. రెండేళ్ల కాలంలో ఆయనకు ఎదురైన మరో పెద్ద సవాలు.. పార్టీ అంతర్గతంగా ఉన్న విభిన్న వర్గాలను ఒకే వేదిక పైకి తీసుకురావడం. కాంగ్రెస్ వంటి విస్తృత ప్రజా ఉద్యమ పార్టీకి సహజంగానే భిన్న అభిప్రాయాలు, భిన్న సామాజిక వర్గాలు, భిన్న నాయకత్వ కేంద్రాలు ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో అందరినీ కలుపుకొని ముందుకు సాగడం అంత సులభం కాదు. అయినప్పటికీ కార్యకర్తలతో నేరుగా సంబంధాలు పెంచుకోవడం, జిల్లా నాయకత్వాన్ని బలోపేతం చేయడం, జాతీయ నాయకత్వం పిలుపులను సమష్టిగా అమలు చేయడం ద్వారా పార్టీ ఐక్యతను కాపాడేందుకు ప్రయత్నించారు. మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల పదవీకాలాన్ని అంచనా వేయాలంటే.. ఆయన ఎన్ని సమావేశాలు నిర్వహించారు అనే లెక్క కంటే, పార్టీ నిర్మాణంలో ఎంత మేరకు చలనం తీసుకొచ్చారన్నదే ముఖ్యమైన ప్రమాణం. గ్రామస్థాయిలో కమిటీలు పనిచేస్తున్నాయా? కార్యకర్తకు పార్టీపై నమ్మకం పెరిగిందా? జిల్లా నాయకత్వం రాష్ట్ర నాయకత్వంతో అనుసంధానమైందా? ఏఐసీసీ పిలుపులు గ్రామానికి చేరుతున్నాయా? ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలుగుతోందా? సామాజిక న్యాయం అంశం పార్టీ రాజకీయాల్లో బలంగా వినిపిస్తోందా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికితే.. మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల కృషి ఏ దిశలో సాగిందో స్పష్టమవుతుంది. పార్టీ అధ్యక్ష పదవిలో ఉండటం ఒక విషయం.. ఆ పదవిని కార్యకర్తలతో అనుసంధానం చేయడం మరో విషయం. మహేష్‌కుమార్ గౌడ్ ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించారు. అందుకే రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన ప్రస్థానంలో గాంధీభవన్ కంటే గ్రామం ఎక్కువగా కనిపించింది. నాయకుల సమావేశాల కంటే కార్యకర్తలతో సమావేశాలకు ప్రాధాన్యం కనిపించింది. ప్రసంగాల కంటే సంస్థాగత నిర్మాణానికి ప్రాధాన్యం పెరిగింది. ఎన్నికల ప్రచారంతో పాటు ఎన్నికలు లేని సమయంలోనూ పార్టీ కార్యక్రమాలు కొనసాగించాలనే ప్రయత్నం కనిపించింది. రాజకీయాల్లో ఒక పార్టీకి ఎన్నికల విజయాలు ఎంత ముఖ్యమో.. ఎన్నికల మధ్య కాలంలో సంస్థాగత బలం అంతకంటే ముఖ్యమైనది. ఆ బలాన్ని పెంచడమే మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల ప్రస్థానానికి ప్రధాన గుర్తింపుగా నిలుస్తోంది. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇది ఎంతవరకు ఉపయోగపడుతుందన్నది కాలమే నిర్ణయించాలి. కానీ పార్టీకి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఒక క్రమబద్ధమైన వ్యవస్థను అందించాలన్న ప్రయత్నం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక ముందున్న అసలు పరీక్ష.. ఈ సంస్థాగత శక్తిని రాజకీయ విజయాలుగా మలచడం. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి అర్హుడికి చేరవేయడం, ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని మరింత పెంచడం, పార్టీ కేడర్‌ను నిరంతరం ప్రజల్లో ఉంచడం, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, యువతమహిళలుబీసీలుదళితులుగిరిజనులు-మైనారిటీలు సహా అన్ని వర్గాలను కాంగ్రెస్‌తో మరింత అనుసంధానం చేయడం రాబోయే కాలంలో కీలకం. రాహుల్‌గాంధీ ప్రతిపాదిస్తున్న సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల రాజకీయానికి తెలంగాణ కాంగ్రెస్ ఒక బలమైన రాష్ట్ర మోడల్‌గా నిలవాలంటే.. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, టీపీసీసీ సంస్థాగత బలం రెండూ సమాంతరంగా ముందుకు సాగాలి. మల్లికార్జున ఖర్గే నాయకత్వంలోని ఏఐసీసీ నుంచి వచ్చే మార్గదర్శకత్వాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడం, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ కేడర్‌ను ఎన్నికలతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల్లో ఉంచడం వంటి బాధ్యతలు టీపీసీసీ ముందున్నాయి. ఈ మొత్తం ప్రక్రియలో మహేష్‌కుమార్ గౌడ్ ముందున్న అతిపెద్ద బలం ఆయన కార్యకర్తలతో ఉన్న అనుబంధమే. పదవి కోసం కార్యకర్తను వెతకడం కాదు.. కార్యకర్త కోసం పదవిని ఉపయోగించాలనే భావన ఆయన రాజకీయ శైలిలో కనిపిస్తుంది. అందుకే రెండేళ్ల కాలాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు కేవలం ఒక అధ్యక్షుడి పదవీకాలంగా కాకుండా.. తమ పార్టీని తమ వద్దకు తీసుకొచ్చిన కాలంగా చూస్తున్నారు. కాంగ్రెస్ చరిత్రలో అధ్యక్ష పదవులు అనేక మంది నాయకులు చేపట్టారు. కానీ ప్రతి నాయకుడు ఆ పదవికి తనదైన ముద్ర వేస్తాడు. మహేష్‌కుమార్ గౌడ్ ముద్ర మాత్రం సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల అనుసంధానం, సామాజిక న్యాయం, ఏఐసీసీ కార్యక్రమాల అమలు, ప్రభుత్వం-పార్టీ సమన్వయం చుట్టూ తిరుగుతోంది. అందుకే కాంగ్రెస్ శ్రేణుల్లో ఆయనపై వినిపించే మాట 'మహేశన్న' కేవలం ఆప్యాయతకు సంబంధించిన పేరు కాదు; కార్యకర్తలతో దగ్గరగా ఉండే నాయకత్వానికి ఒక రాజకీయ గుర్తింపుగా మారింది. రెండేళ్ల ప్రయాణం ముగిసే సమయానికి టీపీసీసీ అధ్యక్ష పదవికి మహేష్‌కుమార్ గౌడ్ ఇచ్చిన అసలు 'మార్క్' ఇదే. పార్టీ కార్యాలయంలో కూర్చొని ఆదేశాలు ఇచ్చే అధ్యక్షుడిగా కాకుండా.. జిల్లాలకు వెళ్లి కార్యకర్తలను కలిసే అధ్యక్షుడిగా, గ్రామాలకు పార్టీ కార్యక్రమాలను తీసుకెళ్లే నాయకుడిగా, జాతీయ నాయకత్వం పిలుపులను రాష్ట్రస్థాయిలో ఉద్యమాలుగా మలిచే సమన్వయకర్తగా ఆయన తనదైన ముద్ర వేశారు. ఇది ఒక వ్యక్తి విజయగాథ మాత్రమే కాదు. రాహుల్‌గాంధీ చూపిస్తున్న సామాజిక న్యాయ మార్గం, మల్లికార్జున ఖర్గే అందిస్తున్న సంస్థాగత మార్గదర్శకత్వం, రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ పాలనా దిశ, మంత్రులు-ప్రజాప్రతినిధులు-కార్యకర్తల సమష్టి కృషి కలిసి తెలంగాణ కాంగ్రెస్‌కు ఒక కొత్త రాజకీయ శక్తిని నిర్మిస్తున్న ప్రక్రియ. ఆ ప్రక్రియను పార్టీ సంస్థాగత స్థాయిలో ముందుకు నడిపించే బాధ్యతను మహేష్‌కుమార్ గౌడ్ తన రెండేళ్లలో సమర్థంగా నిర్వర్తించారనే అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఇక ముందు లక్ష్యం ఒక్కటేఈ బలాన్ని ప్రతి బూత్‌కు తీసుకెళ్లడం.. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండాను మరింత బలంగా ఎగరేయడం.. ప్రజల నమ్మకాన్ని ఓట్లుగా, కార్యకర్తల ఉత్సాహాన్ని ఎన్నికల విజయాలుగా మార్చడం. రెండేళ్లలో నిర్మించిన ఈ సంస్థాగత పునాదులపై రాబోయే రాజకీయ పోరాటాన్ని మరింత బలంగా నడిపించడమే మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వానికి అసలు పరీక్ష. ఆ పరీక్షలో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా 'మహేశన్న' ముందుకు సాగుతున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు.



**మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వాన్ని ప్రత్యేకంగా నిలబెట్టిన అంశం.. ఆయన రాజకీయ ప్రయాణం కార్యకర్తలతో మొదలై, కార్యకర్తలతోనే కొనసాగడం. పదవిలో ఉన్నప్పుడు నాయకులు తన వద్దకు రావాలని ఎదురుచూడకుండా.. తానే కార్యకర్తల వద్దకు వెళ్లే పద్ధతిని ఆయన అనుసరించారు. గ్రామం నుంచి జిల్లా వరకు పార్టీ కార్యకర్తలతో నేరుగా మాట్లాడటం, వారి సమస్యలు వినడం, పార్టీ కార్యక్రమాలపై వారిని చైతన్యపరచడం ద్వారా రాష్ట్ర నాయకత్వానికి క్షేత్రస్థాయి కేడర్‌కు మధ్య అనుసంధానాన్ని పెంచారు. అందుకే కాంగ్రెస్ శ్రేణుల్లో ఆయనకు 'మహేశన్న' అనే ఆత్మీయ గుర్తింపు మరింత బలపడింది.**

– మిద్దె శ్రీనివాసులు, టీపీసీసీ కోఆర్డినేటర్.

## వెలివాడల్లోంచి వెలిగినందుకా
# వెక్కరింతలు?



80 ఏండ్ల స్వతంత్ర భారతం. రాజకీయ అధికారం ఉన్న... ఉన్నత విద్య ఉన్న... వెలివాడల బిడ్డలకు వెక్కిరంతలు తప్పడం లేదు. ఇప్పటికీ అణగారినవర్గాల ప్రజలు అణచివేతకు గురికావడం సర్వసామాన్యం కావడం సర్వత్రా ఖండించాల్సిన విషయం. ఇటువంటి పరిస్థితుల్లో మన దేశంలోని నిమ్నవర్గాల బతుకులు ఎలా ఉంటాయో భారత గ్రామాల్లో నివసించే ఎవ్వరిని అడిగినా వివరిస్తారు. అందుకే, ప్రముఖ అభ్యుదయ రచయిత కళ్యాణ్ రావు, ఈ దేశంలో అణగారినవర్గాల దుస్థితిపై 'అంటరాని వసంతం' అంటూ పెద్ద పుస్తకం రాశారు. మన దేశంలోని దళిత ప్రజలు ఇప్పటికీ ఊరి అవతల ఉండాల్సిన దుర్భర పరిస్థితి. రెక్కల కష్టం తప్ప ఆస్తులేమీ లేని అభాగ్యులు. కూలీ, నాలీ, కష్టాలుకన్నీళ్లు, అవమానాలుఅవహేళనలు... ఈ పదాలు సరిపోవు, వారి జీవితాలను వర్ణించడానికి. అటువంటి పరిస్థితి, దౌన్యపు దుస్థితి నుంచి వచ్చిన ఒక బిడ్డ నేడు భారత రాజ్యాంగం అందించిన ప్రతిఫలాల కారణంగా అత్యున్నత స్థానానికి వచ్చారు. ఆయనే మన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్. కానీ, ఈ దేశంలో ఒక నిమ్నవర్గ బిడ్డ ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా... వెక్కిరింతలు తప్పవు అని ఇటీవల తెలంగాణ అసెంబ్లీలో జరిగిన ఒక సంఘటన నిరూపించింది. భూస్వామ్య, అహంకారపూరిత ధోరణలున్న కొందరు చట్టసభ సభ్యులు ఆ దారుణానికి రెండు వేర్వేరు సందర్భాల్లో ఒడిగట్టారు. వారంతా ఒకటే పార్టీకి చెందడం మనమంతా నిజంగా ఆలోచించాల్సిన విషయం.

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో గతంలో ఒక సందర్భంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ చాలా ఇబ్బందిరకంగా కనిపించింది. తెలంగాణ స్పీకర్, గడ్డం ప్రసాద్ కుమార్ తో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అనవసరంగా వాగ్వాదానికి దిగారు. స్పీకర్ పట్ల ఉన్నతంగా ఉండాల్సిన చట్టసభ సభ్యులు చాలా ఇబ్బందికరంగా ప్రవర్తించడం దారుణం. సభా మర్యాదలు పాటించాలంటూ స్పీకర్ సూచించగా... అందుకు కౌంటర్ గా 'ఈ సభ అందరిది, మీ సొంతమేం కాదు..' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి రెట్టించడం ఏమాత్రం సహేతుకం కాదనిపించింది. దీంతో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ విషయంలో బీజేపీ పూర్తిగా మౌనంగా పాటించడం ఎన్నో అనుమానాలకు తావిచ్చింది. అసలు ఈ పరిణామాలు నిశితంగా పరిశీలిస్తే, ప్రతిపక్ష పార్టీల డీఎన్ఏలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ వ్యతిరేకత ఉన్నదని అర్థం అవుతున్నది. ఇది చారిత్రాత్మకంగా నిరూపితమైన విషయమే. దళిత, గిరిజన, బీసీలను ఆ పార్టీ అగ్రనేతలంతా ప్రతి సందర్భంలో అవమానించినది అక్షరసత్యం. ఇక గత రెండు రోజుల క్రితం జరిగిన ఉదంతమూ చాలా ఇబ్బందికరంగా ఉంది. రాజకీయాల్లో విమర్శలు సహజం. అధికార పార్టీని ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కు. ప్రభుత్వ నిర్ణయాలను తప్పుబట్టడం, హామీలను గుర్తు చేయడం, ప్రజా సమస్యలను లేవనెత్తడం ప్రతిపక్ష బాధ్యత. అయితే ఆ విమర్శలు వ్యక్తిగత దూషణలకు, అవమానాలకు దారి తీస్తే మాత్రం ప్రజాస్వామ్యానికి నష్టం జరుగుతుంది. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాటా మధుసూదన్, ఎన్. నవీన్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించాల్సినవి. అయితే, ఇది కేవలం కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు మధ్య జరిగిన మరో రాజకీయ గొడవగా చూడాల్సిన విషయం కాదు. అసెంబ్లీ స్పీకర్ పదవికి ఉన్న గౌరవం, రాజ్యాంగ వ్యవస్థల పట్ల ఉండాల్సిన మర్యాదకు సంబంధించిన అంశం ఇది. స్పీకర్ అంటే కేవలం ఒక పార్టీకి చెందిన నాయకుడు కాదు. సభలో అధికార, ప్రతిపక్ష సభ్యులందరికీ సమానంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి. స్పీకర్ నిర్ణయాలపై అభ్యంతరం ఉంటే ప్రశ్నించవచ్చు. ఆయన నిర్ణయాలను వివరణలు అడగవచ్చు. ప్రభుత్వంపై ఎంతటి తీవ్ర విమర్శలైనా చేయవచ్చు. కానీ ఆ విమర్శలు వ్యక్తిగత దూషణలుగా మారకూడదు. వ్యక్తిగత విమర్శలు పెరిగే కొద్దీ అసలు సమస్య పక్కదారి పడుతుంది. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన రాజకీయ పార్టీలు వ్యక్తిగత ఆరోపణలు, దూషణల చుట్టూ తిరిగితే ప్రజలకు ఉపయోగం ఏమిటి? వాదన బలంగా ఉంటే దూషణ అవసరం లేదు. ఇవాళ స్పీకర్ కాంగ్రెస్‌కు చెందినవారు. రేపు రాజకీయ పరిస్థితులు మారితే, మరో పార్టీ అధికారంలోకి రావచ్చు. మరో పార్టీకి చెందిన వ్యక్తి స్పీకర్ కావచ్చు. అప్పుడు కూడా ఇదే ప్రమాణం కొనసాగాలి. పదవికి గౌరవం పార్టీని బట్టి మారకూడదు. తెలంగాణ రాజకీయాల్లో పోటీ ఉండాలి. పోరాటం ఉండాలి. ప్రశ్నలు ఉండాలి. పదునైన విమర్శలు ఉండాలి. కానీ మాటకు ఒక మర్యాద, రాజకీయానికి ఒక హద్దు, రాజ్యాంగ సంస్థలకు ఒక గౌరవం ఉండాలి. ప్రభుత్వాన్ని విమర్శించాలి. విధానాలను ప్రశ్నించాలి. ప్రజల్లోకి వెళ్లి పోరాడాలి. కానీ రాజ్యాంగ పదవులను కించపరిచే స్థాయికి రాజకీయ పోరాటాన్ని తీసుకెళ్లడం సముచితం కాదు. పార్టీలు వస్తాయి. పోతాయి. ప్రభుత్వాలు మారుతాయి. రాజకీయ సమీకరణాలు మారుతాయి. కానీ ప్రజాస్వామ్య సంస్థలు శాశ్వతం. వాటి గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత. ఇదే తెలంగాణ రాజకీయాలకు ఇప్పుడు అవసరమైన సందేశం. రాజకీయ పోరాటం ఉండాలి... రాజకీయ పతనం కాదు. పతనం జరిగితే ప్రజాస్వామ్యానికే ప్రమాదం కదా!



**సాగర్ వనపర్తి, పొలిటికల్ అనలిస్టు.**
**9100004402**

## మాధాపూర్‌లో ఈసిగరెట్ల దందాపై ఉక్కుపాదం



**నిర్వాహకుడుతో పాటు అక్రమంగా నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు**

- **స్మోక్ షాపులో ఈగిల్ టీమ్ సోదాలు**
- **నిషేధిత వేప్స్, పాడ్స్, నికోటిన్ పౌచ్‌లు స్వాధీనం**

సైబరాబాద్ - విశాల భారతి

నిషేధిత ఈసిగరెట్లు, వేప్స్ అక్రమ విక్రయాలపై మాధాపూర్ పోలీసులు కొరడా ఝుళిపించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం మాధాపూర్ ఎస్‌హెచ్ఓ ఆధ్వర్యంలోని ఈగిల్ టీమ్ మెట్రో పిల్లర్ నంబర్ 1762 సమీపంలోని 'ది స్మోక్ షాప్'పై సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా భారీగా నిషేధిత ఈసిగరెట్లు, వేప్స్, పాడ్స్, కార్ట్రిడ్జ్‌లు, నికోటిన్ పౌచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో షాపులో ఉద్యోగిగా పనిచేస్తున్న అబూబకర్ సిద్దీక్ ఎం. (26) వద్ద నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన మొత్తం 17 ఈసిగరెట్లు, వాటికి సంబంధించిన ముడి పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విక్రయాల ద్వారా వచ్చినట్లు అనుమానిస్తున్న రూ.72,500 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, పేటీఎం క్యూఆర్, యూపీఐ లావాదేవీల వివరాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నిషేధిత వేప్స్ విక్రయానికి ప్రత్యేకంగా వాట్సాప్ ద్వారా ఆర్డర్లు తీసుకుంటున్నట్లు గుర్తించారు. క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు స్వీకరించి, ర్యాపిడో, పోర్టర్ వంటి డెలివరీ సేవల ద్వారా కస్టమర్లకు వేప్‌స్‌ను చేరవేస్తున్నట్లు తేలింది. స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలో పోర్టర్ ద్వారా జరిగిన లావాదేవీలు, వేప్స్ సరఫరాకు సంబంధించి కొందరితో జరిపిన వాట్సాప్ చాట్‌స్‌ను పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో షాపు యజమాని అబ్దుల్ సఫ్వాన్, ఉద్యోగి అబూబకర్ సిద్దీక్‌తో పాటు వేప్స్ సరఫరా చేస్తున్న వ్యక్తుల పాత్రపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యంగా మైనర్లకు నిషేధిత వేప్స్ విక్రయించారా? అనే కోణంలోనూ విచారణ కొనసాగిస్తున్నారు. నిషేధిత ఈసిగరెట్లు, వేప్స్ నిల్వ చేయడం, విక్రయించడం, సరఫరా చేయడంపై కఠిన చర్యలు తీసుకుంటామని మాధాపూర్ పోలీసులు స్పష్టం చేశారు. యువత, మైనర్లను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ఉత్పత్తులను అక్రమంగా విక్రయించే వారిపై నిఘా మరింత పెంచనున్నట్లు తెలిపారు.



**స్వాధీనం చేసుకున్న సిగరెట్ ప్యాకెట్లు**

# రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే: సత్యవతి రాథోడ్






- మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరును నిరసిస్తూ మహా ధర్నా
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లిస్తోంది
- హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్

**మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ విశాల భారతి:**

అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు అంగోత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం శాసనసభ సంప్రదాయాలను, ప్రజాస్వామ్య విలువలను గౌరవించిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం.. అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించిన తీరుతో తన అసలు వైఖరిని బయటపెట్టుకుందని ఆరోపించారు. "సీతక్క రాజకీయ డ్రామాలు ఇక ఆపాలి. కనీసం మీ నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టి ప్రజల తరపున మాట్లాడాలి" అని సత్యవతి రాథోడ్ సూచించారు. తన సహచర మంత్రి కొండా సురేఖ విషయంలో జరిగిన పరిణామాలపై సీతక్క ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

**కేసీఆర్ హయాంలో దళితులకు గౌరవం.**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కడియం శ్రీహరికి ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే వంటి కీలక పదవుల్లో అవకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని సత్యవతి రాథోడ్ గుర్తు చేశారు. దళితులకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించిన చరిత్ర కూడా కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. దళిత బంధు పథకం ద్వారా కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయకుండా దళితులను మోసం చేసిందని ఆరోపించారు.

**లగచర్ల ఘటనపై నిలదీత.**

"గిరిజన మహిళలపై లగచర్లలో అఘాయిత్యాలకు పాల్పడింది మీ ప్రభుత్వంలోనే కదా?" అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సత్యవతి రాథోడ్ ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకు పరిమితం కావడం సరికాదన్నారు. రేవంత్ రెడ్డి రాజకీయాలు చేయాలనుకుంటే శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించాలని హితవు పలికారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో స్పష్టంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**హామీలపై సమాధానం చెప్పాలి.**

రైతులకు ఇచ్చిన హామీలు, నిరుద్యోగులకు ఇచ్చిన మాటలు, మహిళలకు ప్రకటించిన పథకాల అమలుపై సమాధానం చెప్పకుండా ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేయడం ద్వారా ప్రజా సమస్యలను పక్కదారి పట్టించలేరని సత్యవతి రాథోడ్ అన్నారు. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ఎవరు ఏం మాట్లాడుతున్నారు. ఎవరు ఏం చేస్తున్నారు అన్నది ప్రజలకు స్పష్టంగా తెలుసన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రజల మద్దతుతో తిరిగి అధికారంలోకి వస్తామని సత్యవతి రాథోడ్ ధీమా వ్యక్తం చేశారు.

## తాతా మధు వ్యాఖ్యలు దళిత ద్రోహానికి పరాకాష్ట

- తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి
- మాదిగ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాసగల్ల రమేష్ మాదిగ




**ఆలేరు, విశాలభారతి :** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాదిగ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాసగల్ల రమేష్ మాదిగ అన్నారు. మాదిగ యువసేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగ ఆదేశాల మేరకు ఆలేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమేష్ మాదిగ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను దిగజార్చేలా ఉన్నాయని అన్నారు. అందరితో సౌమ్యంగా, గౌరవంగా వ్యవహరించే స్పీకర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా మాట్లాడటం బీఆర్ఎస్ నాయకుల సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. ఇది కేవలం వ్యక్తిగత దూషణగా చూడరాదని, దళితుల పట్ల ఉన్న వివక్ష, కుల అహంకారానికి ప్రతిబింబంగా భావించాలని అన్నారు. గతంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వం, మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని డిప్యూటీ సీఎంగా చేసి అనంతరం ఎలాంటి కారణం లేకుండా పదవి నుంచి తొలగించిందని రమేష్ మాదిగ ఆరోపించారు. ప్రస్తుతం దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభ స్పీకర్‌గా ఉన్నత స్థానంలో ఉండటాన్ని ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కారంచేడు ఘటన వంటి చారిత్రక సామాజిక విషాదాల నేపథ్యంలో దళితుల పట్ల వివక్షకు తావులేకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. తాతా మధుపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తాతా మధు చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని మాదిగ యువసేన పక్షాన డిమాండ్ చేస్తున్నామని రమేష్ మాదిగ తెలిపారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి.. ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల చేయాలి

- రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం భారీ నిరసన
- జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు
- సర్పంచుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు జూకంటి అనిల్



**ఆలేరు, విశాలభారతి :** గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు, మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం అసెంబ్లీ ఎదుట నిర్వహించనున్న భారీ నిరసన కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రస్తుత, మాజీ సర్పంచులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సర్పంచుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు, టంగుటూరు సర్పంచ్ జూకంటి అనిల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని అన్నారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో మాజీ సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పనులు పూర్తి చేసి ప్రజలకు మౌలిక వసతులు కల్పించిన సర్పంచులకు బిల్లులు చెల్లించకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. గ్రామపంచాయతీలకు తగిన ఆర్థిక వనరులు అందుబాటులో లేకపోతే స్థానిక పాలనను సమర్థవంతంగా నిర్వహించడం కష్టమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని మండలాల సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అనిల్ కోరారు. ప్రతి మండలంలోని ప్రస్తుత, మాజీ సర్పంచులను సమన్వయం చేసి పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. "మన హక్కుల కోసం.. మన గ్రామాల అభివృద్ధి కోసం.. మన బకాయిల సాధన కోసం సర్పంచులు, మాజీ సర్పంచులు ఐక్యంగా పోరాడాలి. రేపటి నిరసన కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి మన ఐక్యతను చాటాలి" అని జూకంటి అనిల్ పిలుపునిచ్చారు.

## మునగాలలో సూర్యాపేట జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

**మునగాల, (విశాలభారతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో సెప్టెంబర్ 26 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర, సబ్‌జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా జట్ల ఎంపికలను ఈ నెల 13వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు మునగాల జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అల్లం ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే జూనియర్ బాలురు 20 సంవత్సరాల లోపు వయస్సు, 75 కేజీల లోపు బరువు కలిగి ఉండాలని, సబ్‌జూనియర్ బాలికలు 16 సంవత్సరాల లోపు వయస్సు, 55 కేజీల లోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమోలను తమ వెంట తీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం అసోసియేషన్ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి మాతంగి సైదులు, జాయింట్ సెక్రెటరీ రమేష్ బాబులను 9573962957, 9704095937 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన వివరించారు.

## ఘనంగా ఏఎస్ఐ లక్ష్మణ్ జన్మదిన వేడుకలు

**విశాలభారతి, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ పట్టణంలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకల్లో జర్నలిస్టులు నేదురి నర్సయ్య, ఇల్లందుల రాజు తదితరులు పాల్గొని లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముస్తాబాద్ మండల బీజేపీ కార్యవర్గ సమావేశం



**ముస్తాబాద్, (విశాల భారతి):**

భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి ప్రాణం అని పేర్కొన్న ఆయన, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీ కమిటీలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని దిశానిర్దేశం చేశారు.

**సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు**

**కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం:**

'వికసిత్ భారత్ సంకల్పం'లో భాగంగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు.

**స్థానిక సమస్యలపై పోరాటం:**

మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులకు వినతిపత్రాలు అందించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు, పోరాటాలు చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, మెంగని మహేందర్, వరి వెంకటేష్, చిగురు వెంకన్న, మీస స్వామి, దీటి సత్తయ్య, ఒరగంటి సత్యం, మార్గల వేణు, మీస కర్ణాకర్, మల్లేశం, యాదగిరి, నర్సింలు, తిరుపతి, వినయ్ తదితరులు, బూత్ కమిటీ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగార్జున ప్రైవేట్ స్కూల్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

- డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం.
- అనుమతులు లేవంటున్నారు.. గుర్తింపు ఎలా వచ్చింది?
- నాగార్జున ప్రైవేట్ స్కూల్‌పై సమగ్ర విచారణకు డిమాండ్
- పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్

**మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ విశాలభారతి:**




కురవి మండల కేంద్రంలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్‌పై వస్తున్న ఆరోపణలపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలోని డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ అనుమతులు లేవని అధికారులు చెబుతున్నప్పుడు.. అదే పాఠశాలకు విద్యాశాఖ గుర్తింపు ఎలా లభించింది? అనే ప్రశ్నకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాల భవన నిర్మాణాలు, అదనపు నిర్మాణాలు, భవన భద్రత, గ్రామపంచాయతీ అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు తదితర అంశాలపై వస్తున్న ఆరోపణలను అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఆరోపణలు వెలువడినప్పటికీ ఇప్పటివరకు సమగ్ర విచారణలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో అధికారుల నిర్లక్ష్యానికి తావుండకూడదని అన్నారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో సంయుక్త తనిఖీలు నిర్వహించి పాఠశాల నిర్మాణాలు, అనుమతులు, గుర్తింపుకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే అధికారికంగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమతులు, గుర్తింపు విషయంలో ఏదైనా లోపం ఉంటే దానికి బాధ్యత ఎవరిదో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గ్రామసభలో తీసుకున్న తీర్మానాన్ని వెంటనే అమలు చేసి, సమగ్ర విచారణ నిర్వహించి నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. విద్యార్థులు చదువుకునే పాఠశాల భవనాల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. తక్షణమే సంయుక్త తనిఖీలు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తదుపరి దశలో ఆందోళనలు చేపడతామని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ హెచ్చరించారు.

## తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజ్జల రాజు




**ముస్తాబాద్, (విశాల భారతి):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు గజ్జల రాజు మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. తాతా మధును బీఆర్ఎస్ పార్టీ వెంటనే బేషరతుగా బర్తరఫ్ చేయాలని, తెలంగాణ సమాజానికి, దళిత సమాజానికి బీఆర్ఎస్ అధిష్ఠానం బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఏళ్ల బాల్‌రెడ్డి, కొండం రాజిరెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ వ్యవస్థలను అవమానించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదని, అవసరమైతే నిరసనలను రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ వద్ద గంజాయి పెట్టివేత

- పట్టుబడిన గంజాయి 18.6 కేజీలు.. దీని ధర సుమారు 9.33 లక్షలు ఉంటుందని అంచనా

**బూర్గంపాడు /విశాల భారతి:** బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ సమీపంలో నమ్మదగిన సమాచారం మేరకు వ్యవసాయ మార్కెట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా టీవీఎస్ ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగులలో సుమారు 18.6 కేజీల గంజాయిని బెంగళూరుకి అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో బూర్గంపాడు అదనపు ఎస్సై ఈ.నాగబిక్షం నిందితులను పట్టుకోవడం జరిగింది. పట్టుబడిన గంజాయి ధర సుమారు 9.33 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితుల వద్ద ఒక ద్విచక్ర వాహనాన్ని రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన నిందితుల వివరాలు 1)నవీన్ కుమార్ 27 సం" 2)విజయ్ కుమార్ 33 సంవత్సరాలు .వీరిద్దరూ తుమకూరు జిల్లా కర్ణాటక రాష్ట్రానికి చెందినవారు. వీరిద్దరూ కర్ణాటక రాష్ట్రం తుమకూరు నుండి బయలుదేరి ఒడిస్సా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి తిరిగి వెళుతుండగా బూర్గంపాడు వద్ద పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. అదనపు ఎస్సై. నాగబిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్.హెచ్. ఓ. మేడ ప్రసాద్ వీరిద్దరిని జ్యుడీషియల్ రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

## పెసా చట్టం పై పంచాయితీ కార్యదర్శులకు అవగాహన కల్పించండి

- ఆదివాసి నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి




**వాజేడు సెప్టెంబర్ 8 విశాల భారతి :** మండల పరిధి చెరుకూరు, మండపాక, వాజేడు వంటి కొన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ ల అనుమతులు లేకుండా వలస గిరిజనేతరులు నిర్మాణాలు చేస్తున్నట్లు ఎంపీడీఓ కు తెలిపారు. అనుమతులు లేని నిర్మాణాలకు యూజర్ పన్ను పేరుతో ఇంటి పన్ను కట్టించడం సరికాదని ఎంపీడీఓ కు వివరించారు. అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకోకుండా పన్నులు కట్టించడం చట్ట విరుద్ధ చర్య అన్నారు. తమ వృత్తి పరమైమ విధివిధానాలు తెలుసుకోకుండా కొందరు పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నట్లు ఎంపీడీఓ కు తెలిపారు. పెసా చట్టం పైన పంచాయతీ కార్యదర్శులకు అవగాహనా కల్పించాలని కోరినట్టు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఏ ఎన్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు, జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్, నాయకులు తలండి ప్రసాద్, మనోజ్, అశోక్, మల్లిఖార్జున్, వినోద్, ఏ ఎన్ ఎస్ సోషల్ మీడియా అధికార ప్రతినిధి పాయం అజయ్, తదితరులు పాల్గొన్నారు..

## పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు అవగాహన సదస్సు




**గుండాల విశాల భారతి :** పత్తి రైతులకు వానలు సమయంలో కురువని సందర్భంగా అధిక రోగాలు ఆకర్షించే సందర్భంలో ముందు జాగ్రత్తగా పత్తి లింగాకర్షణ నివారణ రైతులకు ఉచితంగా లింగాకర్షణ బుట్టల పంపిణీ గుండాల, సెప్టెంబర్ 7: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణతో పాటు పంట నష్ట పరిమితి శాతాన్ని గుర్తించడంలో లింగాకర్షణ బుట్టలు ఎంతో ఉపయోగపడతాయని ఎల్‌డీసీ ప్రతినిధి అఖిలేష్ తెలిపారు. పెద్దపడిశాల గ్రామంలో ఎల్‌డీసీ, మోడర్న్ ఆర్కిటెక్చర్స్ ఫర్ రూరల్ ఇండియా (మారి) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సస్యరక్షణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతిని అరికట్టేందుకు రసాయనాల వినియోగాన్ని తగ్గించి, ఎకరాకు 6 నుంచి 10 లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. వీటి ద్వారా పురుగు ఉధృతిని ముందుగానే గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపట్టవచ్చని వివరించారు. సదస్సులో నిపుణులు పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ విధానాలు, శాస్త్రీయ సాగు పద్ధతులు, ముందస్తు జాగ్రత్తలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులు తగ్గించేందుకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పత్తి పంటకు ప్రధాన సమస్యగా మారుతున్న గులాబీ రంగు పురుగును లింగాకర్షణ బుట్టల సహకారంతో సమర్థవంతంగా నియంత్రించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌డీసీ సంస్థ ఆధ్వర్యంలో బీసీఐ రైతులకు లింగాకర్షణ బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి రైతు తప్పనిసరిగా తన పత్తి పొలంలో లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఏఈవో కే. నవనీత, పీయూ మేనేజర్ వెంకట వంశీ, ఉపసర్పంచ్ మట్టగజ్జ మల్లేష్, వార్డు సభ్యులు ఎర్ర ఎల్లేష్, పీయూ కోఆర్డినేటర్ పేరపు నరేష్, మారి సంస్థ సిబ్బంది పాలడుగు మహేష్, గుగులోతు తిరుపతి, ధరావత్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలకు కదిలిన ఎర్రదండు



**బొమ్మలరామారం, విశాలభారతి :** యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలకు బొమ్మలరామారం మండలం నుంచి సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి కార్యకర్తలు ఉత్సాహంగా బయలుదేరి రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, మండల కార్యదర్శి అన్నెమయిన వెంకటేశం ఆధ్వర్యంలో మండల కార్యకర్తలు యాదగిరిగుట్టకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రాజప్ప, కూర నరేష్, కూర రాములు, లవడియా బుజ్జి, బోదాసు నర్సమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు సైతం మహాసభలకు హాజరయ్యారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్య, ఉపాధి, సామాజిక సమస్యలపై సమరశీల పోరాటాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. AIYF రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడంతో పాటు యువత హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

- ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలి
- టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



**కొత్తగూడెం, సెప్టెంబర్ 8 (విశాల భారతి ప్రతినిధి) :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు అన్నారు. టీపీసీసీ పిలుపు మేరకు సుజాతనగర్ సెంటర్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్రా అజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ. దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ కుమార్ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్నారని, అలాంటి గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తిపై అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజకీయంగా భేదాభిప్రాయాలు ఉండవచ్చని, ప్రభుత్వ విధానాలను విమర్శించవచ్చని, అయితే వ్యక్తిగత గౌరవాన్ని, స్పీకర్ పదవి ఔన్నత్యాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. అసెంబ్లీలో టీషర్టులు విప్పి బనియన్‌తో రావడం ద్వారా ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నాగా సీతారాములు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, జిల్లా జనరల్ సెక్రటరీ పైడా రాజేంద్రప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాంబాబు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కిన్నెర వెంకన్న, సర్పంచులు వజ్జా రామారావు, గుగులోతు జానికిరామ్, శ్రీకాంత్, మాజీ సర్పంచులు భద్రూ నాయక్, రాందాస్ నాయక్, ఏఎంసీ డైరెక్టర్ అమ్రూ నాయక్, కోటేష్ నాయక్, శ్రీనివాసరావు, నరసింహారావు, ఎట్టి భాస్కర్, భుక్య మోహన్, గాజుల సీతారామయ్య, మండే శ్రీను, లింగం లక్ష్మయ్య, చల్లా నాగేశ్వరరావు, ఓర్సు ఉపేందర్, సిద్దల నరేందర్, నునావత్ సంతోష్, చిట్లూరి సుధీర్‌తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.


## మహిళల గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కుతోంది

- వెయ్యి రోజుల పాలనపై శేరిలింగంపల్లిలోని హైదర్ నగర్‌లో మహిళల నిరసన
- సింధం శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**హైదర్ నగర్ విశాల భారతి:** మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవం లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. సింధం శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో హైదర్‌నగర్ రామ్‌నరేశ్‌నగర్ కాలనీలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించారు. అనంతరం హైదర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలకు వచ్చిన మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును మాధవరం రోజాదేవి, సింధం శ్రీకాంత్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళా ప్రభుత్వమని చెప్పుకోవడం తప్ప.. మహిళలకు రాష్ట్రంలో సరైన గౌరవం దక్కడం లేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి ఒక్కరి హక్కని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాన్ని పోలీసుల ద్వారా అణచివేయాలని చూడటం సరికాదన్నారు. వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధ్యానంతో మనసుకు ప్రశాంతత: ప్రిన్సిపల్ పోలారపు పద్మ



**పాల్వంచ విశాల భారతి, సెప్టెంబర్ 8:** ధ్యానం ద్వారా మనసుకు ప్రశాంతత చేకూరడంతో పాటు ఆలోచనల్లో సానుకూల మార్పు, జీవన విధానంలో సమతుల్యత ఏర్పడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచ ప్రిన్సిపల్ పోలారపు పద్మ అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని కళాశాలలో ప్రిన్సిపల్ అధ్యక్షతన హార్ట్‌ఫుల్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పోలారపు పద్మ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం, యోగా, ఆధ్యాత్మిక సాధనకు కేటాయించాలని సూచించారు. ఇవి మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హార్ట్‌ఫుల్‌నెస్ నోడల్ అధికారి మాధురి మాట్లాడుతూ హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి జిల్లాలో ఉన్న కన్హా శాంతివనంను ప్రతి ఒక్కరూ జీవితంలో కనీసం ఒక్కసారైనా సందర్శించాలని కోరారు. కమలేష్ డి. పటేల్ (దాజీ) బోధించే ధ్యానం, అంతర్గత ప్రశాంతత, స్వీయ పరివర్తన, ప్రేమ, కరుణ, సరళమైన జీవనం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'శిక్షా రత్న' అవార్డు సాధించిన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మను, హార్ట్‌ఫుల్‌నెస్ నోడల్ అధికారి మాధురిని కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె. మాధవి, విజయ ప్రసాద్, డాక్టర్ బి. కొండలరావు, డాక్టర్ వేముల కామేశ్వరరావు, డాక్టర్ టి. అరుణకుమారి, పొట్లపువ్వు శ్రీనివాసరావు, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ ఎన్. శ్రీదేవి, సౌమ్య, దీపిక, విమల, హారిక, కరీమ, వకుల, డాక్టర్ రమేష్, ధర్మారావు, బి. రమేష్, ఈ. శ్రీను, డాక్టర్ పవన్ తదితర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## చిత్తారమ్మ ఆలయం వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

**కాకతీయ టెక్నో స్కూల్ వీధిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలి**

**కుత్బుల్లాపూర్ విశాలభారతి:** గాజులరామారం డివిజన్‌లోని చిత్తారమ్మ దేవి ఆలయం యూటర్న్ వద్ద ప్రమాదాల నివారణకు ఇరువైపులా తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఈఈ గోవర్ధన్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు.షాపూర్-గాజులరామారం మార్గంలో వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో యూటర్న్ వద్ద ప్రమాదాల ముప్పు ఉందని, ప్రజల భద్రత దృష్ట్యా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చిత్తారమ్మ ఆలయం ఎదురుగా ఉన్న కాకతీయ టెక్నో స్కూల్ వీధిలో దెబ్బతిన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఈఈ గోవర్ధన్ గౌడ్ సానుకూలంగా స్పందించి సంబంధిత ఏఈకి సమాచారం అందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సాయి ప్రతాప్, రావుల పృథ్వి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.





## సీఎం సహాయనిధితో పేదలకు వైద్య భరోసా

**ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాల పంపిణీ**

**కుత్బుల్లాపూర్-విశాల భారతి**

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఎల్ఓసీ పత్రాలను జీడిమెట్ల 132 వ డివిజన్‌కు చెందిన నిరుపేద లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. చింతల్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరారెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్య భద్రతే తమ ప్రధాన లక్ష్యమన్నారు. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నాలుగేళ్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి




**టీపీడీఎంఏ బంద్‌కు భాగ్యరథి డిగ్రీ కళాశాల మద్దతు**


**కుత్బుల్లాపూర్-విశాల భారతి**

తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు గత నాలుగు విద్యా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టీపీడీఎంఏ ఇచ్చిన పిలుపునకు చింతల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన బంద్‌లో కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ పాల్గొన్నారు. నాలుగేళ్లుగా బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలల నిర్వహణ, అధ్యాపకులు, సిబ్బంది జీతాల చెల్లింపులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని నల్ల జై శంకర్ గౌడ్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయడంతో పాటు, ఇకపై రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

## నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్**

**తెలంగాణ బ్యూరో :**



తెలంగాణ అసెంబ్లీ జరుగుతున్న తీరు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల వ్యవహారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల బజారు భాషను చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. "నువ్వు కొట్టినట్లు చేయ్...నేను ఏడ్చినట్లు చేస్తా" అంటూ...కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కలిసి కాంప్రమైజ్ పాలిటిక్స్ తో ప్రజలను పిచ్చోళ్లను చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. స్పీకర్ ను బీఆర్ఎస్ నేతలు అసభ్య పదజాలంతో దూషించడాన్ని ప్రజాస్వామ్యవాదులెవరూ జీర్ణించుకోలేరని బండి సంజయ్ అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుతోపాటు పోలీసులపై చేయి చేసుకున్న బీఆర్ఎస్ నేతలను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాల్సిందేనని.. చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నాయకులు నల్లచొక్కాలు ధరిస్తే అసెంబ్లీలోకి రానివ్వకపోవడం కూడా తప్పేనని కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ విమర్శించారు. పార్లమెంట్ లో రాహుల్ గాంధీ నల్లచొక్కా ధరించి పార్లమెంట్ కు రాలేదా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధ నిరసనలను కూడా ప్రభుత్వం అంగీకరించలేక అసహనంతో కాంగ్రెస్ తప్పుల మీద తప్పులు చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అక్కడో రూల్, ఇక్కడో రూల్ వుంటుందా? అని నిలదీశారు. ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకుపెట్టి రెండ్రోజులపాటు ఒకే అంశంపై చర్చ జరిపి విలువైన సభా సమయాన్ని వృధా చేయడం దుర్మార్గమని బండి సంజయ్ అన్నారు. ప్రజా సమస్యలపై ఇకనైనా డైవర్షన్ డ్రామాలాపండని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సూచించారు. 22ఏతో జనం అల్లాడుతున్నారని.. మంత్రులు, అధికార పార్టీ నేతల రూ.వేల కోట్ల భూదందా చేస్తున్నారని ఆరోపించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు రాక, సర్టిఫికెట్లు రాక లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సాగు నీరందక దక్షిణ తెలంగాణ రైతాంగం ఆందోళనతో ఉందని.. ఉద్యోగాలు లేక, ఐటీ సంస్థలు, పరిశ్రమలు మూతపడి నిరుద్యోగులు అల్లాడుతున్నారని చెప్పారు. డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు రాక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు గగ్గోలు పెడుతున్నారని.. అసెంబ్లీలో వీటిపై చర్చ కోసం అందరూ ఎదురు చూస్తున్నారని అభిప్రాయపడ్డారు. ప్రజలు సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాల్సిన శాసనసభను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజకీయాలకు వాడుకుంటున్నాయని బండి సంజయ్ అన్నారు. ఈ క్రమంలోనే ఫీజు రీయంబర్స్‌మెంట్ పై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు రక్తం కారేలా కొట్టారని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలపైనా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే వారిపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని వ్యాఖ్యానించారు.

## అవేర్ బీఎస్సీ ఎంఎల్‌టీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపుగా జ్ఞాపికలు, బహుమతులతో సత్కారం**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** అవేర్ బీఎస్సీ ఎంఎల్‌టీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ పూజ్య మాధవంజీ ఆశీస్సులు, మార్గదర్శకత్వంతో, డైరెక్టర్ డా. ఇర్షాద్ అహ్మద్ నాయకత్వంలో, ఎంఎల్‌టీ ప్రిన్సిపాల్ డా. ఫవాజ్ సమన్వయంతో కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు విద్యాబోధన అందించడంతో పాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తూ, విద్యాపరంగా రాణించేలా నిరంతరం ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. వారి అంకితభావానికి గుర్తింపుగా అధ్యాపకులు, సిబ్బందికి జ్ఞాపికలు, బహుమతులను అందజేసి సత్కరించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది ఆషిఫ్, రవీన్‌తో పాటు అధ్యాపకులు ఆసియా, జెహ్రా, మృణాళిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన

**కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం.. తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శంషాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే తాతా మధును బీఆర్ఎస్ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని కేసీఆర్‌కు హితవు పలికారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన స్పీకర్ పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వ్యాఖ్యలు, సంప్రదాయాలకు బీఆర్ఎస్ నేతలు తెరలేపితే ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర ఎస్సీ ఉపాధ్యక్షులు జెల్లపల్లి నరేందర్, సనమ్ శ్రీనివాస్ గౌడ్, గుర్రం రణధీర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, సంజయ్ యాదవ్, సులోచన, బొబ్బిలి శేఖర్, ధనుంజయ్, మహేందర్ ముదిరాజ్, ఇంద్రాపాల్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సర్పంచులు కోటేశ్వర గౌడ్, రవి నాయక్, అంజి ముదిరాజ్, నజీర్ భాయ్, టీ. అశోక్, ఎంపీటీసీ బంగారం కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్‌గౌడ్, చందు యాదవ్, కిరణ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు మణి, అభి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్.. ఆటో, పల్సర్ బైక్ స్వాధీనం



**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊటపల్లి గ్రామంలో జరిగిన ఇంటి దొంగతనం కేసును సీసీఎస్ హైదరాబాద్ మరియు శంషాబాద్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేసి ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి నేరానికి ఉపయోగించిన ఆటో, ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఊటపల్లి గ్రామంలో ఆగస్టు 7, 8 తేదీల మధ్య రాత్రి ముదావత్ గోపాల్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంట్లోని కొంత నగదుతో పాటు సుమారు ఒక తులం బంగారు నల్లపూసల గొలుసు, 40 తులాల వెండి పట్టీలు (కాలి గొలుసులు) చోరీకి గురయ్యాయి. దీనిపై శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 447/2026 కింద BNS సెక్షన్లు 331(4), 305(a) ప్రకారం కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మార్ల ఈశ్వర్ (22), మార్ల నవీన్ (23)లను అరెస్ట్ చేశారు. వీరు రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామానికి చెందినవారిగా పోలీసులు తెలిపారు. విచారణలో నిందితులు తమ సహచరులతో కలిసి శంషాబాద్, ఆదిబట్ల, కడ్తాల్‌తో పాటు నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన TG30T8243 నంబర్ ఆటో, TS07HJ5443 నంబర్ బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న A1 షఫీ, A2 యోగి, A3 బన్నీలను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ కేసును సీసీఎస్ హైదరాబాద్ సీఐ సుధాకర్, ఎస్సై గౌరేందర్ గౌడ్ పర్యవేక్షణలో, శంషాబాద్ ఎస్సై రాఘవేందర్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ విజయ్, కానిస్టేబుళ్లు రాజు, ప్రేమ్‌కుమార్ రెడ్డి, జంగయ్య, మిగతా ముగ్గురు గురించి పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## భూముల రీసర్వే పనులను వేగవంతం చేయాలి

**మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్**



**పాల్వంచ విశాల భారతి, సెప్టెంబర్ 8:** భూముల రీసర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాల్వంచ మండలంలోని బొజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానం, భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి, భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బొజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో రీసర్వే చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జరిగిన సర్వే పురోగతి, మిగిలిన పనులు, సిబ్బంది, పరికరాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రీసర్వే ప్రక్రియను మూడు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి భూ యజమాని భూమి హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న భూ రికార్డులతో సరిపోల్చాలని ఆదేశించారు. భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా సర్వేను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారి భూపత్రాలను పరిశీలించారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వే ప్రక్రియకు సహకరించాలని కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధార ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్డ్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కడలి పాత్ర చేశాకా ఆ భయం పోయింది

"సముద్రంలా కనిపించే ఓ అమ్మాయిలా నటించాను. ఆ పాత్ర ప్రతి అమ్మాయికీ కనెక్ట్ అవుతుంద"ని చెబుతోంది వైష్ణవి చైతన్య. 'బేబి' సినిమాతో అందరి దృష్టినీ తనవైపు తిప్పకున్న అచ్చ తెలుగు కథానాయిక ఈమె. ఇటీవల ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్' సినిమాలో నటించారు.ఈ చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా వైష్ణవి చైతన్య మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఒక స్థాయిలో ప్రేక్షకులకు చేరువైంది 'బేబి'. అలాంటి సినిమా తర్వాత మేం మళ్లీ కలిసి పనిచేస్తున్నప్పుడు, మా ఎంపిక సరైందే అని మేం నిరూపించుకోవాలి కదా. మాకైతే ఆ నమ్మకం మొదట్నుంచీ ఉంది. ఎందుకంటే 'బేబి' సినిమాకీ, 'ఎపిక్' కథకీ ఏమాత్రం సంబంధం ఉండదు. ఆ పోలికలు కనిపించనప్పుడు ప్రేక్షకులు కేవలం ఈ కథ, పాత్రల గురించే మాట్లాడుకుంటారని మేం నమ్ముతున్నాం. అదే జరిగితే మేం గెలిచినట్టే! 'బేబి' సినిమా విడుదల తర్వాత ఎలాంటి పాత్రల్ని ఎంపిక చేసుకోవాలనే ఓ భయం నాలో ఉండేది. ఎందుకంటే ఇక్కడిదాకా రావడం ఒకెత్తు, ఈ ప్రయాణాన్ని ఇలాగే కొనసాగించడం మరో ఎత్తు. అందుకే మొదట్లో కొంచెం కంగారుపడ్డాను. ఇప్పుడు అలాంటి ఒత్తిళ్లేమీ లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నా. 'ఎపిక్' సినిమాలో నేను పోషించిన కడలి పాత్ర నాకు బాగా కనెక్ట్ అయ్యింది. కడలిలాగే ఉండాలని ప్రతి ఒక్కరూ అనుకుంటారు కానీ, చుట్టూ పరిస్థితులు, తల్లిదండ్రుల ప్రభావంతో అది లోపలే ఉండిపోతూ ఉంటుంది. అయితే ఈ కథ వింటున్నప్పుడు... ప్రతి ఒక్కరం ఏదో ఒక సమయంలో ఇలా మన కోసం మనం గట్టిగా నిలబడాలి కదా అనిపించింది. అందుకే ఈ పాత్రకు బాగా కనెక్ట్ అయ్యాను. సినిమా చేస్తూ నేను చాలా నేర్చుకున్నా. ఇంతకుముందు బయటకు వచ్చి ఏదైనా మాట్లాడాలంటే లోపల చిన్న భయం ఉండేది. కడలి పాత్ర చేశాక నేను మరింత ఆత్మవిశ్వాసంతో మెలగడం, ముందు మనల్ని మనం నమ్మాలనే విషయాల్ని నేర్చుకున్నా.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.